క్లుప్తంగా

కోడి పుంజులు మాయం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో రూ.80 వేల విలువైన రెండు కోడిపుంజులు మాయమైన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు యర్రబాలెంకు చెందిన పి.వెంకటేశ్వరరావు కోళ్లను పెంచుకుంటూ జీవనం కొనసాగిస్తుంటాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కోళ్ల షెడ్డులోని రెండు పుంజులను అపహరించుకుపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పౌరసరఫరాల శాఖ యూట్యూబ్ చానల్

మంగళగిరి: పౌరసరఫరాల శాఖ నూతనంగా రూపొందించిన యూ ట్యూబ్ చానల్‌ను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పౌరసరఫరాల శాఖ నిర్వహించే అన్ని విషయాలు యూ ట్యూబ్ చానల్‌లో ప్రసారమవుతాయన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, పౌరసరఫరాల శాఖ అధికారులు సిబ్బంది అందరూ యూ ట్యూబ్ చానల్‌పై రైస్ కార్డుల వినియోగదారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్‌యూ రోడ్డులోని లైన్ల మార్పిడి నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాడేపల్లి రూరల్ ప్రాంతంలోని వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు అష్టలక్ష్మి అమ్మవారికి అభిషేకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై వేంచేసియున్న అష్టలక్ష్మి అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో అష్టైశ్వర్య ప్రాప్తి కోసం శుక్రవారం ఉదయం 9 గంటలకు అష్టలక్ష్మి అమ్మవార్లకు తిరుమంజనసేవ (అభిషేకం) నిర్వహించనున్నామని భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించి అష్టలక్ష్మి అమ్మవారి అనుగ్రహం పొంది, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పురాణం వెంకటాచార్యులు ఆ ప్రకటనలో కోరారు.

అవినీతిరహిత సమాజానికి కృషి చేయాలి

తాడేపల్లిరూరల్: అవినీతి రహిత సమాజానికి అందరూ కృషి చేయాలని ఇన్‌స్పాన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత గద్దె శ్రీనివాస్ అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని డాక్టర్ కేఆర్‌ఆర్ ఎం డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ అవినీతిని రూపుమాపగలిగితేనే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు. అనంతరం పౌరుల సమగ్రతా ప్రతిజ్ఞను విద్యార్థుల చేత చేయించారు. ప్రిన్సిపాల్ కె.గిరిధర్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ టి.రాఘవరెడ్డి, సరళాదేవి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

మంగళగిరి: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ మల్లిఖార్జునరావు హెచ్చరించారు. గురువారం రాత్రి పట్టణంలోని పలు చోట్ల మద్యం సేవించే వారితో పాటు ద్విచక్రవాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 10 మందికి జరిమానా విధించడం జరిగిందన్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలు డ్రైవింగ్, సైలెన్సర్లు లేకుండా వాహనాలు నడపడం నిషేధమని ప్రతిరోజూ నగరంలోని కూడళ్లలో తనిఖీలు నిర్వహించి తొలిసారి జరిమానా విధించడం జరుగుతుందని అనంతరం కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌన్సెలింగ్‌లో ఎస్ఐ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- నగరంలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే
- కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. గురువారం తొలుత లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అధికారులతో సమావేశం అయిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పెద్దకోనేరు నిర్మాణం పనులు వెంటనే చేపట్టి పూర్తిచేయాలన్నారు. పనుల ఆలస్యానికి గల కారణాలకు అడిగి తెలుసుకుని సమస్యను వెంటనే పరిష్కరించి పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆలయానికి వెళ్లే రహదారి వద్ద దాత సహకారంతో నిర్మించనున్న ఆర్చీ ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్ఆర్ఐ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మట్లాడుతూ నగరంలో డ్రైనేజీ సమస్యలను సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి రాకుండా కల్వర్టు నిర్మాణం చేపట్టాలన్నారు. గౌతమబుద్ధ రోడ్డు విస్తరణ పూర్తయిన నేపథ్యంలో మురుగు నీరు నిల్వలు రోడ్డుపైకి రాకుండా కల్వర్టులు నిర్మించాలన్నారు. కమిషనర్ యు.శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎం డీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప సభను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంగళగిరి: ఈ నెల 11వ తేదీన హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న మాదిగల విశ్వరూపను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద గురువారం సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. విశ్వరూప సభలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననున్న నేపథ్యంలో మాదిగలు పెద్దఎత్తున చలో హైదరాబాద్‌కు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చిలక కిరణ్ కుమార్, చందోలు విక్టర్ పాల్, కటకోటి నాగేశ్వరరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, గుండిమెడ నాగేంద్ర, పాతకోటి భాస్కర్, రాజేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం..

తాడికొండ: ఈనెల 11న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరుపతలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కిరణ్ మాదిగ పిలుపునిచ్చారు. తుళ్లూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మందకృష్ణ సారథ్యంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 30 సంవత్సరాల్లో అలుపెరగని పోరాటం జరుగుతోందన్నారు. సామాజిక, న్యాయమైన ఎస్సీ వర్గీకరణ లేనిదే మాదిగ, మాదిగ ఉపకులాలు, విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షాలా మిగిలిపోతున్నాయన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకుడు పల్లెపోగు రాజురావు, సీనియర్ నాయకులు పల్లెపోగు థామస్, మేకల సుధీర్, యద్దనపూడి జ్యోతి, కంభంపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సకల ఆత్మల పండుగ



నులకపేటలో మాట్లాడుతున్న కేసీ వర్క్స్ విచారణ గురువులు ఫాదర్ పి.మరియ దాసయ్య



ఫిరంగిపురంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న గురువులు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని ఆర్‌సీఎం బరియల్ గ్రౌండ్‌లో గురువారం సాయంత్రం సకల ఆత్మల పండుగను వైభవంగా నిర్వహించారు. తమ తమ కుటుంబాలలో మృతిచెందిన పెద్దల సమాధులను పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన దివ్యపూజాబలిలో గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొని వాక్యోపదేశం చేశారు. మృతిచెందిన ప్రతి ఒక్కరికీ ప్రభువు సామ్రాజ్యంలో స్థానం ఇస్తారని చెప్పారు. దివ్యగీతాలు ఆలపించారు. బాల ఏసుదేవాలయ విచారణ గురువు పి.బాలస్వామి, సహాయ విచారణ గురువు అనిల్, బ్రదర్ థామస్, మఠ కన్యస్త్రీలు, కథోలికులు, గుడి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నులకపేటలో...

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో సకల ఆత్మల మహోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీ వర్క్స్ విచారణ గురువులు ఫాదర్ పి.మరియ దాసయ్య మాట్లాడుతూ మరణించిన వారిని గుర్తుచేసుకుని వారి ఆత్మలు ప్రభువును చేరి అక్కడ దేవుణ్ణి స్తుతించేందుకు, ఇంకా అటువంటి అవకాశం పొందకుండా ఉన్నవారి కోసం వారు దేవుడు వారిని దగ్గరకు చేర్చాలని కోరుకుంటూ ప్రతి సంవత్సరం నవంబర్ 2వ తేదీన ఈ సకల ఆత్మల మహోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విచారణ గురువులు పి.పాపయ్య ప్రార్థనలు నిర్వహించారు. ఈ సకల ఆత్మల మహోత్సవంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, తాడేపల్లి జేసీఎస్ కన్వీనర్ ఈదుల మూడి డేవిడ్‌రాజులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

సాయినాథునికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామశివారులోని సాయినాథ ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి మహాహారతి, కాగడ హారతి, అష్టోత్తర, సహస్రనామ అర్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: నవంబర్ 15వ తేదీన విజయవాడ సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. గురువారం దుగ్గిరాలలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ హైలెవల్ చానల్ పూర్తి చేయకపోవడం కారణంగా వరి పొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయని, బకింగ్‌హామ్ కెనాల్ పక్కన ఉన్న వరిపంట పొలాలు ఎండిపోతున్నాయని, ఆయిల్ ఇంజిన్ ద్వారా ఎకరానికి రూ.10వేలు అదనంగా పెట్టుబడి పెట్టి వరిపొలాలకు నీరు పెడుతున్నారని అన్నారు. దుగ్గిరాల జగనన్న కాలనీ పక్కన కరెంటు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, ఎన్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, జి.యోహాను, కె.కోటయ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏపీపీగా 'కోట'

తెనాలిరూరల్: తెనాలి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కోట రమేష్‌బాబు నాయుడుని నియమిస్తూ డైరెక్టర్ ప్రాసిక్యూషన్స్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్న జె. ఎలిజబెత్‌రాణి పదవీ కాలం ఇటీవల పూర్తయ్యింది.

ఎంపీడీఓ విజయలక్ష్మణ్‌కు పదోన్నతి

తెనాలి టౌన్: తెనాలి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పనిచేస్తున్న ఎల్.విజయలక్ష్మణ్‌కు డీఎల్‌డీవోగా పదోన్నతి లభించింది. తాడేపల్లిలోని రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ కార్యాలయానికి గురువారం యామె బదిలీ అయ్యారు. ఏఓగా పనిచేస్తున్న వి.ప్రతాప్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి యువకుడు మృతి

మంగళగిరిలో చోరీకి గురైన బైక్‌పై వెళుతుండగా ఘటన



ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహం, బైక్

తెనాలిరూరల్: చోరీకి గురైన బైక్‌పై వెళ్తున్న యువకుడు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. 22 నెలల క్రితం మంగళగిరిలో బైక్ చోరీకి గురైనట్టు పోలీసులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి చినరావూరు డొంకకు చెందిన ఇండ్ల సాయికృష్ణ(19) పెదరావూరు వైపు నుంచి జంపని వైపు పల్సర్ బైక్‌పై గురువారం తెల్లవారుజామున వెళుతున్నాడు. పెదరావూరు శివారులోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్ నంబరు ప్లేటు లేకపోవడంతో ఇంజిన్, చాసిస్ నంబర్ల ఆధారంగా ఆ వాహనం 2022 జనవరి 19న మంగళగిరి పట్టణంలో చోరీకి గురైందని, ఈ మేరకు మంగళగిరి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. మృతి చెందిన యువకుడే బైక్ చోరీ చేసి వినియోగించుకుంటున్నాడా లేక చోరీకి పాల్పడిన వారి నుంచి కొనుగోలు చేసి వాడుతున్నాడా అన్న అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కూలీలకు అధికంగా ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఉపాధిహామీ జాయింట్ కమిషనర్ జి.జ్యోతి

ఫిరంగిపురం: కూలీలకు ఉపాధి హామీ పనులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎక్కువసంఖ్యలో గుర్తించాలని ఉపాధిహామీ జాయింట్ కమిషనర్ జి.జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఉపాధి హామీ రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువ సంఖ్యలో పండ్లతోటల పెంపకం గురించి వివరించి పెంచేలా వారిని ప్రోత్సహించాలని చెప్పారు. రైతులు, ఉపాధి కూలీలకు ఉపయోగపడేలా పనులు గుర్తించాలని తెలిపారు. ఎక్కువమందికి ఉపాధి చేకూరేలా పనులు ఉండాలని, పనులను గుర్తించి లేబరు బడ్జెట్‌కు సరిపడేలా అంచనాలు తయారు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలందరిచేత జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలని, బ్యాంకులో ఎన్‌పీసీఐ లింకు చేయించేలా చూడాలని ఆదేశించారు. ఏపీడీలు బాలమ్మ, శివనారాయణ, ఫౌండేషన్ మేనేజర్ శిరీష, డీబీటీ మేనేజర్ గౌస్, ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ ప్రభాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నూతక్కి విద్యార్థి



విద్యార్థిని సయ్యద్ జుబేరియాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన రేవేంద్రపాడు విద్యార్థులు

మంగళగిరి: గత నెల 31వ తేదీన గుంటూరు ఉర్దూ హైస్కూలులో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ – 17 బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనపరిచిన తమ విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూలు పీడీ రజనీనాయక్ గురువారం తెలిపారు. పాఠశాలలో 7వ తరగతి చదివే సయ్యద్ జుబేరియా ఈనెల 3వ తేదీ నుంచి 5 వరకు కడప జిల్లా మైదుకూరులో జరిగే పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినిని పాఠశాల హెచ్‌ఎం రాజీవ్ రత్న, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

అండర్–14 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌కు రేవేంద్రపాడు విద్యార్థులు ఎంపిక..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ గురువారం తెలియజేశారు. నారా కోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–14 బాలబాలికల హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలో విశేష ప్రతిభ కనబరిచి బి.జోషి శ్రీ (9వ తరగతి, బాలుర విభాగం), ఎస్.సాయి శబరీష్ (8వ తరగతి, బాలుర విభాగం), ఎంపిక కాగా, స్టాండ్‌బైగా ఎస్.రోహిత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీలు మెల్లెంపూడి రవి, డి.సుజాతలను, క్రీడాకారులను విద్యాకమిటీ చైర్మన్ కొప్పుల ప్రకాష్‌రావు, సర్పంచ్ పి.మేరమ్మ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

చేనేత కార్మికులకు మజూరీ పెంచాలి



చేనేత మగ్గాల షెడ్ల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు

మంగళగిరి: చేనేత కార్మికులకు మజూరీ పెంచాలని కోరుతూ ఈ నెల 4వ తేదీన జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరారు. చేనేత కార్మికుల మజూరీ పెంచి రెండు సంవత్సారాలు పూర్తవుతుండగా, నిత్యావసర సరకులు, కుటుంబ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఉత్పత్తిదారులు కార్మికుల మజూరీ పెంచాలన్నారు. గురువారం నగరంలోని టిడ్కో నివాసాల వద్ద చేనేత మగ్గాల షెడ్ల వద్ద కార్మిక సంఘాల నేతలు ప్రచారం నిర్వహించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా కార్మికుల మజూరీ పెంచేందుకు నిర్వహిస్తున్న ప్రదర్శనను కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, రామనాథం పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, డోకిపర్తి రామారావు, వెంకటసుబ్బారావు, కూరపాటి కోటేశ్వరరావు, వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్

మంగళగిరి: కడపలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంతో పాటు విశాఖఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఈఎఫ్ నాయకులు తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం బంద్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 32 మంది ప్రాణాల త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కుపరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ అడ్డుకోవడాన్ని నిరసిస్తూ చేపట్టిన ఆందోళన ఈ నెల 8వ తేదీకి ఏడాది పూర్తయిన సందర్భంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేసి కేంద్రప్రభుత్వం నిరంకుశత్వ ధోరణితో చేపట్టిన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవడంతో పాటు కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధించుకునేందుకు కృషి చేయాలని కోరారు. నాయకులు మత్తే అభిషేక్, యార్లగడ్డ శివగోపి, భార్గవ్, హనక్‌బాబు, అజయ్, సతీష్‌లు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థినికి అంతర్జాతీయ ఉద్యోగం



విద్యార్థిని నవనీతను అభినందిస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎంసీఏ చదువుతున్న విద్యార్థిని అంతర్జాతీయ ఉద్యోగం సాధించిందని వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో ఎంసీఏ చదువుతున్న బండి నవనీత అనే విద్యార్థిని జపాన్‌కు చెందిన హ్యూమన్ రెసోసియే కంపెనీలో రూ.24లక్షల వార్షిక జీతంతో ఉద్యోగం సాధించిందని అన్నారు. నవనీత డిగ్రీలో కామర్స్ బ్యాంక్ గ్రౌండ్ కలిగి ఉన్నప్పటికీ గత సంవత్సర కాలంలో డేటా సైన్స్, ఫుల్‌స్టాక్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా విజయం సాధించిందని వివరించారు. ఎంసీఏ విభాగంలో మొట్టమొదటి అంతర్జాతీయ ప్లేస్‌మెంట్ సాధించిన నవనీతను సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అభినందించారు. ప్రొ.వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ విభాగం అధిపతి, ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్లు, ఇతర అధ్యాపకులు నవనీతను అభినందించారు.

ఘనంగా సాయి మందిరం వార్షికోత్సవం



సాయి మందిరంలో భక్తులు

తెనాలి టౌన్ : నందివెలుగులోని షిరిడిసాయిబాబా మందిరంలో గురువారం వార్షిక మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు సాయిబాబాకు కాకడ హారతితో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకుని అభిషేకాలు చేశారు. బాబావారి విశిష్ట, మహిమల గురించి ఆదిపూడి సాయిరామ్ భక్తులకు వివరించారు. హారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం బాబావారిని ప్రత్యేక వాహనంపై ఉంచి సన్నాయి మేళాలు, కోలాటం, భజనలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మందిర వ్యవస్థాపకులు ఎం.వి. హరిప్రసాద్, కార్యదర్శి శ్రీవల్లి, ఉపాధ్యక్షురాలు పార్వతి, సర్వతి, రాజా, సుకుమార్, అశోక్, ఆధ్యాత్మిక భాగవతారిణి శారదా చలపతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.